www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 నవంబర్ 2022

5

తూర్పుగోదావరి



రాజానగరంలో జ్వరంతో చిన్నారి మృతి

ప్రజాశక్తి-రాజాగనరం

తొమ్మిదేళ్ల చిన్నారి తీవ్ర జ్వరంతో మరణించిన సంఘటన శనివారం రాజానగరం మెయిన్‌రోడ్ వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో చోటు చేసకుంది. డెంగ్యూ వ్యాధితో చిన్నారికి తీవ్ర జ్వరం వచ్చి చనిపోయిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లినా చిన్నారని బతికించుకోలేకపోయామని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులకు జ్వరాలతో బాధ పడుతున్నారని గుర్తించడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. రికార్డుల్లో మాత్రం సాధారణ జ్వరాలుగా నమోదు చేసుకుని తాత్కాలిక మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. దీనిపై స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిని వివరణ కోరగా చిన్నారి తీవ్ర జ్వరం, బిపి తగ్గిపోవడం వల్ల చనిపోయినట్టు చెప్పారు.

ప్రజల వద్దకే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-చాగల్లు, తాళ్లపూడి

రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థ, వార్డు సచివాలయాల వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల ఇంటి వద్దకే అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. శనివారం చాగల్లులో రూ.40 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి వనిత ప్రారభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సంచాలనాత్మక నిర్ణయం తీసుకుని గ్రామాల్లో ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం దిశగా ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లోనే సచివాలయాలను రైతు భరోసా కేంద్రాలను, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ పరంగా ఏ సహకారం కావాలన్నా వెంటనే సమీపంలోని గ్రామ సచివాలయంలోనే సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గతంలో ప్రభుత్వపరంగా ఏ


తాళ్లపూడిలో పర్యటిస్తున్న మంత్రి

కార్యక్రమం కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని నేడు గ్రామంలోని సచివాలయం ద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొయ్య మణి, సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, ఎంపిపి మట్టా వీరాస్వామి, వీరాస్వామి, దొరయ్య పాల్గొన్నారు.

నవరత్నాల పథకాలు అమలుతో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. తాళ్లపూడి మండలంలోని మలకపల్లిలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వనిత పాల్గొన్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని ఎన్నో రకాల పథకాలను అందజేస్తున్న ఘనత జగనన్న దేనన్నారు. మూడేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జొన్నకూటి పోసిరాజు, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

8, 9, 10న సిపిఎం రాష్ట్ర శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నవంబర్ 8, 9, 10 తేదీల్లో సిపిఎం రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. శ్యామలా సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో అరుణ్ మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ఆర్థిక, రాజకీయ, సామజిక పరిస్థితులపై పార్టీ నాయకత్వానికి అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరానికి రానున్న రోజుల్లో ఏ విధంగా కృషి చేయాలో కార్యకర్తలకు ఈ శిక్షణా తరగతుల్లో జాతీయ నాయకులు తరగతులు బోధిస్తారని తెలిపారు. ఈ తరగతులు విజయవంతంగా నిర్వహించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, టి.సావిత్రి, పోలిన


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్.మూర్తి

వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, పి.తులసి, నాయకులు పడాల రామకృష్ణ, ఎన్.చిన్న, కృష్ణ, అన్నామణి, వెంకటలక్ష్మి, సోమేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజర్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఉంౖడాజవరం

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, ఎంపిటిసిలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ సమయానికి ముందుగానే చేరుకున్న ఎంపిపి, సభ్యులు అధికారులు హాజరు కాకపోవడంతో సభ ఎలా నిర్వహించేది అంటూ అసహనం వ్యక్తం చేశారు. అధికారులే హాజరుకాని సర్వసభ్య సమావేశానికి మమ్మల్ని ఎందుకు పిలిచారంటూ మండల పరిషత్ సభ్యులు, హాజరైన గ్రామ సర్పంచ్‌లు మాకు పనులు లేవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశ్వూరు. ఈ సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించవలసిన సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బాయ్ కాట్ చేయమనడంతో, జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య కోరంకు సరిపడా సభ్యులు హాజరయ్యారని, సభను బాయ్ కాట్ చేసి వచ్చిన అధికారులను అవమానించడం సరికాదని, సమావేశం నిర్వహించేందుకు సహకరించవలసిందిగా సభ్యులను కోరారు. దీనితో హాజరైన అధికారుల తోటే


వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

సభ నిర్వహించారు. ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాభివృద్ధికి పనులు నిర్వహించుకోలేకపోవడం అవమానకరంగా ఉందని సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సమావేశంలో ఎంపిపి, జెడ్‌పిటిసిలకు సర్పంచ్ నరేంద్రబాబు వినతిపత్రం అందజేశారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగేశ్వరరావు

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ప్రజాశక్తి-కడియం

లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుని సమస్యల నుంచి బయటపడాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి పదవ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఈ లోక్ అదాలత్‌ను అందుబాటులో తీసుకొచ్చిందని, దీని ద్వారా సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎంతో సులువుగా పరిష్కరించవచ్చున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా అక్కడికక్కడే కేసును పరిష్కరించి న్యాయం చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అదాలత్‌పై అవగాహన పెంచుకుని కేసుల నుంచి విముక్తి పొందాలన్నారు. న్యాయవ్యవస్థపై కనీస పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అందరూ కషి చేయాలన్నారు. ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని, దీని ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో న్యాయవాది ఎం.పద్మ, పారా లీగల్ వాలంటీర్ చిట్టితల్లి పాల్గొన్నారు.


రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం కొనుగోలు చేయక రైతుల ఆవేదన

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. శనివారం సింగారం రైతులు మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట మొత్తం నేలమట్టం కాకుండా మండల వ్యవసాయ అధికారులు, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని మండల వ్యాప్తంగా రైతులు కోరుతున్నారు. చేతికి వచ్చిన పంటను కొనుగోలు చేయకపోతే రైతులు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వందలాది ఎకరాలు సింగవరం గ్రామంలో పంట పూర్తి అయిందని ఇప్పటివరకూ ఎటువంటి ప్రభుత్వ కొనుగోలు అధికారులు తమ వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని రైతులు, కౌలు రైతులు వాపోతున్నారు. వాతావరణం మబ్బుగా ఉందని వర్షం పడితే తమ పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఉందని పలువురు రైతులు అంటున్నారు. అప్పులు చేసి పంటలు పండించామని అధికారులు స్పందించకపోతే రైతులు ఎలా బతకాలని దళారుల చేతుల్లో రైతులు మోసపోయే పరిస్థితులు గతంలో లేకపోలేదని రైతు కష్టాలను తీర్చే దిశగా ప్రభుత్వ నాయకులు, జిల్లా అధికారులు స్పందించాలని సింగవరం గ్రామపంచాయతీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే పంటను కోసి ఆరబెట్టుకుంటున్నామంటున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను శనివారం ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సందర్శించి ఆయా కళాశాలల అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిహెచ్.కృష్ణను కలిసి డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యల గురించి మాట్లాడారు. ఆర్‌ఐడి మధుసూదనరావు, డిఇఒ అబ్రహాంను కలిసి ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను కలిసి ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అహ్మద్ షరీఫ్ ఉన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శ్రీ చైతన్య యాజమాన్యం 900 మంది విద్యార్థులకు అకిరా హాస్పిటల్ చీఫ్ డాక్టర్ ప్రభాకర్ బందం అధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ వైద్యం అవసరమైన విద్యార్థులకు అధునాతనమైన వైద్య పరికరాల ద్వారా మెరుగైన వైద్యాన్ని అందిస్తామని సూచించారు. ఎజిఎం ఎన్.శ్రీనివాస్, ఆర్ఐ శివజ్యోతి, ప్రిన్స్‌పల్ ఎ.సురేంద్ర, డాక్టర్ ప్రభాకర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. అకిరా వైద్య బృందానికి, శ్రీచైతన్య యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెట్రోల్ బంకు నిర్మాణం కేసు వాయిదా

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో వ్యవసాయ సహకార సంఘం నిర్మిస్తున్న పెట్రోలు బంకు నిర్మాణంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో దాఖలైన పిటిషన్‌పై విచారణను డిసెంబరు 16వ తేదీకి వాయిదా వేశారని పిటిషనర్ చిడిపి నకుల సురేష్ తెలిపారు. సీతానగరంలో పాత్రికేయుల సమావేశంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. తమ తరపున న్యాయవాది 2004 డిటిసిపి ప్లాన్ ప్రకారంగా పెట్రోలు బంకు నిర్మాణం పూర్తిగా చెరువుపై నిర్మించినట్లు చెప్పారు. దీనిపై ఇండియన్ ఆయిల్ తరపు న్యాయవాది అభ్యంతరం తెలుపుతూ పిటిషనర్ తమ పిటిషన్‌లో ఎక్కడా చెరువు గురించి ప్రస్తావించలేదన్నారు. తన తరపు న్యాయవాది పిటిషన్ సవరించడానికి సమయం కోరారని తెలిపారు. దీనిపై సమయం ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



ప్రజలతో ఆడడం అలవాటైపోయింది మరి..!!

విద్యాశాఖలో సమాచారం ఉండాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మండల స్థాయిలో విద్యాశాఖ సమాచారం అంతా ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలని ప్రాంతీయ విద్యా సంచాలకులు జోన్-2 డి.మధుసూదనరావు ఎంఇఒలను ఆదేశించారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాలో 19 మండలాల విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ సమాచారాన్ని, గణాంక వివరాలను ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేసుకుంటూ ఉన్నతాధికారులు అడిగినప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఎంఇఒలను ఆదేశించారు. డిఇఒ ఎస్.అబ్రహం మాట్లాడుతూ ఆర్‌జెడి ప్రారంభించిన లిప్ కార్యక్రమం, పదో తరగతి విద్యార్థులకు ఆయన రూపొందించిన డయాగ్రమ్ పుస్తకాలు ఎంతగానో ఉపయోగ పడ్డాయన్నారు. అనంతరం డిఐ బి.దిలీప్ కుమార్ మదుసూదన రావును ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న ఆర్‌జెడి

బ్యారేజి స్లూయిజ్ గేట్ల ఎత్తివేత

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరం కాటన్ బ్యారేజి స్లూయిస్ గేట్లు స్విచ్ ఆన్ చేసి శనివారం ప్రారంభించారు. గేట్లు ఎత్తి 11,535 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఇఇ రాజాన కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. ఇలా చేయడం వలన బ్యారేజ్‌లో పేరుకుపోయిన మట్టి ఇతర వ్యర్థాలు దీని ద్వారా బయటకు పోయి గోదావరి శుభ్రపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ కుమార్, కందికట్ల నాగలక్ష్మి, చదలవాడ సుధాకర్, బివి.సాయిశ్రీ కుమార్, అద్దంకి సాయిరామ్, లాక్ సూపరింటెండెంట్లు వీరాశ్రీ, బ్రహ్మాజీ, విక్రమ్, శ్రీనివాసరాజు, ఎలక్ట్రీషియన్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తాళ్లపూడి

వంగవీటి రంగా అభిమానులు తాళ్లపూడి మలకపల్లిలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించిన పి.పూర్ణచంద్రరావు మాట్లాడారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పొడిగించినట్టు డిఇఒ ఎస్.అబ్రహాం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ తల్లిదండ్రుల సంవత్సరాదాయం రూ.మూడు లక్షల 50 వేల లోపు ఉన్న విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు www.bse.ap.gov.inలో వివరాలు తెలుసుకోవాలన్నారు.

క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- గోకవరం

భూపతిపాలెంలోని గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయిలో ఆటల పోటీల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ బేతపూడి రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో సెలక్షన్స్ ఎపిఆర్ స్కూల్ భూపతిపాలెంలో నిర్వహించినట్టు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులును భూపతిపాలెం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అందరికీ అందుబాటులో వైద్యసేవలు

ప్రజాశక్తి-గోపాలపురం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల శాస్త్ర చికిత్సలూ అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్య రంగంలో విప్లవాత్మమైన మార్పులు తీసుకొచ్చిందని అందులో భాగంగా గైనిక్, మత్తు వైద్య నిపుణులు, శాస్త్ర చికిత్సల వైద్యులు, జనరల్ మెడిసిన్, పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పరశురాం, రాకేష్, చైతన్య, రాణి పాల్గొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 9న మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ తెలిపారు. ఎంపిపి కె.సీతారామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు, హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

సహాయక సంఘాలకు టూల్‌కిట్లు


ప్రజాశక్తి- ధవళేశ్వరం

ఆంధ్రా బ్యాంక్ గ్రామీణ అభివద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల వారికి శనివారం టూల్ కిట్లు అందజేసింది. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ రమ, ఆర్‌ఎస్ఇటిఐ తాడి శ్రీనివాసరావు పాల్గొని 35 మంది యానిమేటర్లకు టూల్ కిట్లు అందజేశారు. వీరు సహాయక సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులైనవారికి యానిమేటర్లు ఈ కిట్లలో ఉన్న బోధనోపకరణాల సాయంతో వీరికి బోధించారు.

ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిడిగా అప్పలరాజు

ప్రజాశక్తి -గోకవరం

కొవ్వూరు క్లస్టర్ ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జి ఎపిడిగా అప్పలరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన ఉద్యోగ బాధ్యతలను విధి నిర్వహణను సక్రమంగా నిర్వహిస్తానని, ఉపాధి కూలీలకు ఉపాధి కల్పనకు సిబ్బందితో పనులు గుర్తింపచేసి ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కషి చేస్తానన్నారు. రైతులకు మేలు చేసే విధంగా గుర్తించిన పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు.


పీడీ రాంగోపాల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎపిఒ అప్పలరాజు

క్రీడల్లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండపేట ఎస్‌విఎస్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు యుఎస్.అభిషేక్, వి.కావ్యసంజన ఎంపికయ్యారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. విద్యార్థుల విజయాని కారణమైన పిఇటి సిహెచ్. ప్రీతీ, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపల్ శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

పందుల పెంపకందారుల ఆందోళన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పందుల పెంపకానికి నగరపాలక సంస్థ స్థలాన్ని చూపాలంటూ శనివారం క్వారీ నగరంలోని పందుల పెంపకందారులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ ఆదేశాలతో తమిళనాడుకు చెందిన వ్యక్తులు నగరంలో సంచరిస్తున్న పందులను పట్టుకుని వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పందులను తరలించి ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటున్నారంటూ ఆరోపిస్తూ నగరంలోని పందుల పెంపకందారులు పెద్ద ఎత్తున తరలివచ్చి పందులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని వాహనంపై, పందులను పట్టుకున్నవారిపై దాడి చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వాహనాన్ని అడ్డుకోవడంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి అక్కడినుంచి పంపించి వేశారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.


ఆందోళన చేస్తున్న పెంపకం దారులు

చివటంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - ఉంౖడాజవరం

ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ద్వారా వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేసినట్టు ఉంౖడాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్‌ఎస్ఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని చివటంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు, ఒ.విజయ కుమారి, ఎఎన్ఎం సూర్యకుమారి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ విజయకుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంత్యక్రియల కోసం మానవత సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన వృద్ధుడు సంపంగి నూకరాజు శనివారం మరణించగగా అంత్యక్రియల నిమిత్తం మానవత సంస్థ రూ.ఐదు వేలు సభ్యులు వెలుగుబంటి శ్రీనివాసరావు వృద్ధుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న మానవత సభ్యులను పలువురు అభినందించారు.



ఇంజనీరింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏజెఎఫ్ సి మెజిస్ట్రేట్ హర్షవర్ధన్

కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పెద్దాపురం మండల న్యాయ శాబాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏజెఎఫ్‌సి మెజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి జీవితం న్యాయవ్యవస్థతో ముడిపడి ఉందన్నారు. విద్యార్థి దశనుండే చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో సామాన్య జనానికి చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. సీఐ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ దిశా చట్టం మహిళలకు మంచి ఆయుధమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో నిర్వహించిన చట్టాలపై అవగాహన ర్యాలీని మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ ర్యాలీ దివిలి, చంద్రమాంపల్లి మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో, కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు,అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు,ఏవో సందీప్,ప్యానల్ న్యాయవాదులు మడికి రాంబాబు, ఎస్ విశాలాక్షి, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ,ఆకుల మురళీకష్ణ,మాసా చంద్రావు, కుంచే నాని బాబు, రెహమాన్ పాల్గొన్నారు.

అన్నవరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలో ఉన్న ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌ను ఎపిఎస్ జోనల్ చైర్మన్ గదుల బంగారమ్మ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఆమె ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో వివిధ స్టాల్స్‌ను, క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. అన్నవరం రద్దీకి తగ్గట్టుగా ప్లాట్ ఫామ్‌ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాంప్లెక్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే కార్గో పాయింట్ విస్తీర్ణత పెంచాలన్నారు. తాను త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కరిస్తారని ఆమె తెలిపారు,. ఆమె వెంట జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, తుని ఆర్‌టిసి డిపో మేనేజర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

నైపుణ్యా అభివద్ధి తోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు మరచుకోవటం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు అన్నారు.శనివారం పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ తరగతుల ప్రారంభ సభలో ఆయన ప్రసం గించారు. ప్రిన్సిపాల్ సర్వ రామేశ్వరుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భాషాపరమైన, సాంకేతి కపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారన్నారు. సివిల్ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి వీరేంద్ర చౌదరి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు వివిధ అంశాలపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణం పై విచారణ

ప్రజాశక్తి - కాజులూరు

ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై కలెక్టర్ స్పందన కార్యక్రమంలో శలపాక గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం తహశీల్దార్ సత్యనారాయణ ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఇందిరాదేవి విచారణ నిర్వహించారు. శలపాక గ్రామంలో పాఠశాల చెంతనే ప్రభుత్వ స్థలం ఉండటంతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో స్థానికులు కొంతమంది పాఠశాల చెంతనే ఆరోగ్యకేంద్రం ఉండటం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ సత్యనారాయణ, ఇన్‌చార్జి పీడీ ఇందిరాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుండి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేఘేశ్వరరావు పంచాయితీ కార్యదర్శి అనంతలక్ష్మి గ్రామ రెవెన్యూ అధికారి గనికమ్మ సర్పంచ్ పి.గనిరాజు ఎంపీటీసీ సభ్యులు దడాల రమేష్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

10 న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపిడిఒ సీహెచ్. ఇందిరాదేవి శనవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు సర్పంచ్లు హాజరుకావాలని డివిజన్ , మండలస్థాయి అధికారులు తమ శాఖ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

గోదారి గలగలలు

ఆవేదన... ఆందోళన...

ఆవేదన.... ఆందోళన...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు ఓ వైపు, పారిశుధ్య నిర్వహణ లోపం మరో వైపు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. గతేడాదితో పోల్చితే డెంగీ, టైఫాయిడ్ కేసులు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు కిట కిటలాడుతున్నాయి. పిహెచ్‌సిలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పల్లెల్లో ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించక తప్పటం లేదని రోగులు వాపోతున్నారు. అప్పటికీ తగ్గకపోతే జిల్లా కేంద్రాల్లోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రలలో వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫ్యామిలీ ఫిజీషన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుంటోంది. విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి జనవరి నుంచి పూర్తి స్థాయిలో ఫ్యామిలీ ఫిజిషియన్‌సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. వాటితో పాటు ప్రస్తుతం ప్రభుత్వ పిహెచ్‌సిలలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ పరీక్షే..

పాఠశాల విద్య పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభత్వం నూతనంగా అమలు చేస్తున్న విధానం విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులకూ పరీక్షలా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విధానంలో 1, 2 తరగతుల విద్యార్థులకు ప్రశ్నపత్రాల్లోని అన్ని ప్రశ్నలు టీచర్లు చదివి వినిపించి వారితో అందులోనే జవాబులు గుర్తించాలి. ఈ రెండు తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో జవాబులను టీచర్లే బబుల్ చేయాలి. 3వ తరగతి విద్యార్థులకు నాలుగు ప్రశ్నలు, 4, 5 తరగతుల విద్యార్థులకు ఒక్కో ప్రశ్నను పెద్దగా చదివి విద్యార్థులకు వినిపించి ఓఎంఆర్ షీట్‌లో జవాబులను బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో దిద్దాలి. ఈ విధానం తలనొప్పిగా మారిందని టీచర్లు వాపోతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఎట్టకేలకు 4 నెలల అనంతరం జరిగే ఈ పరీక్షలు గందర గోళంగా మారాయి. మొత్తం ఆరు సబ్జెక్టులకు ఒకే ఓఎంఆర్ షీట్‌ను అందజేసి ప్రతి రోజూ భద్రపర్చటం తిరిగి విద్యార్థికి అందజేయాలనే నిబంధనలు తలనొప్పిగా మారాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ అనాలోచిత విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది వెల్లడైన ఫలితాలే పునరావృతమవుతాయనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

చిగురించిన ఆశలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏలేరు కుడి కాల్వకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయటంతో మెట్ట ప్రాంత రైతుల ఆశలు చిగురించాయి. గోకవరం మండలంలో గుమ్మళ్ల దొడ్డిలో బయో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన విషయం విధితమే. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగ్గంపేట ఎంఎల్‌ఏ జ్యోతుల చంటిబాబు కుడికాల్వకు నిధులు కేటాయించాలని కోరటంతో సభ అనంతరం ముఖ్యమంత్రి నిధులు మంజూచేసినట్లు తెలిపారు. త్వరిత గతిన పనులు ప్రారంభించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు వివిధ సమస్యలపై నిర్వహించిన ఆందోళలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. 'అయ్యన్న' అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేశారు. బయో ఇథనాల్ సంస్థ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసనలకు పిలుపు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను నిర్బంధానికి గురి చేశారు. సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించిన జనసేన పార్టీ కార్యకర్తలను సైతం అడ్డుకున్నారు. మొత్తం మీద కట్టుదిట్టమైన భద్రతా బలగాల మధ్య ముఖ్యమంత్రి సభను ముగించేశారనే అభిప్రాయం ప్రజలు, ప్రతిపక్ష పార్టీలలో వ్యక్తమైంది.

విద్యార్థుల ఆందోళనలు

కందుకూరి విద్యా సంస్థల ప్రహరీ లోపల ఉన్న ఆస్తుల మొత్తాన్ని ప్రభుత్వానికి అప్పచెప్పాలని విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ దశల వారీ ఆందోళనలు చేపట్టింది. రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. నిరుపేదలకు విద్య, వితంతు వివాహాలు, అనాధ శరణాలయాల కోసం కందుకూరి వీరేశలింగం ఈ సమాజాన్ని స్థాపించారు. ఉన్నత ఆశయాల కోసం స్థాపించిన ఈ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు.

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ అధికారులను కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉప్పాడ పంచాయతీ పరిధిలో ఉన్న సూరాడ పేట గ్రామానికి ఇళ్ల స్థలాలకు, అవసరాలకు కేటాయించిన స్థలాన్ని వైసిపి పార్టీ నాయకులు కబ్జా చేసి అమ్ము కుంటున్నారని సూరాడపేట గ్రామానికి చెందిన కొంతమంది శనివారం పిఠాపురం టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ వర్మని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన వర్మ ఫోన్ ద్వారా అధికారులతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయంలో ఈ ప్రాంతానికి చెందినా వారికీ ఇళ్ళ స్థలాలు కొరకు, ప్రజలు అవసరాల మేరకు కమ్యూనిటీ హాల్, పిల్లలకు స్కూల్ నిమిత్తం లే-అవుట్ చేసి ఇచ్చిన భూమిని సెంటు రూ.2 లక్షలు చొప్పున ఈ కమ్యూనిటి స్థలం విలువ 70లక్షలకు అమ్మేశారని ఆరోపించారు. అలాగే మెయిన్ రోడ్ లో అన్నా క్యాంటిన్ కొరకు కేటాయించిన స్థలాన్ని కూడా వైసిపి ఎంఎల్ఎ రూ.50 లక్షలకు అమివేశా రని ఆరోపించారు. గ్రామ మత్స్యకార ప్రజలు ప్రభుత్వ ఆస్తిని కాపాడమని పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఎంఎల్ఎ ఒత్తిడి వలన ఏమి చేయలేని పరిస్థితిలో స్థానిక అధికారులు ఉన్నారని తెలిపారు. తక్షణమే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాలు అక్రమాలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సూరాడ నాగేశ్వరరావు, చోడిపల్లి ప్రసాద్, మెరుగు భూషణం, చొక్కా కష్ణ, సూరాడా జాను, కోడా కష్ణ, సత్తిరాజు, కృష్ణ, అప్పన్న మత్స్యకార నాయకులు పాల్గొన్నారు

మన్యంవారిపాలెం విఆర్ఒకు సస్పెన్షన్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - కాకినాడ

జగ్గంపేట మండలం, మన్యంవారిపాలెం గ్రామంలో గ్రేడ్-2 విఆర్ఓ గా పనిచేస్తున్న బెల్లపు రాజు ను పట్టాలదారు పాసు పుస్తకాల జారీ, భూముల రిజిస్ట్రేషన్ అంశాల కొరకు రామవరం, మన్యంవారిపాలెం రైతుల నుండి సొమ్ము వసూలు చేసి అవినీతికి పాల్ప డినందుకు, ఇర్రిపాక గ్రామ లబ్దిదారులకు ఓటిఎస్ పట్టాలను పంపిణీ చేయనందుకు, మద్యం సేవించి విధులకు హాజరు కావడం, తరచుగా గైరుహాజరు కావడం కారణాలపై సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు పద్మనాభం

త్వరలో పెన్షనర్స్ 'మనం-మన కోసం'

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కొరకు ఏవిధమైన ప్రీమియం లేని మనం-మనకోసం సంక్షేమ పథకం త్వరలో ప్రారంభమవుతుందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం, కార్యదర్శి శాస్త్రి తెలిపారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం కాకినాడలోని పెన్షనర్స్ భవన్ లో జరిగింది. నూతన జిల్లాల ఏర్పాటుతో అసోసియేషన్ కోనసీమ, రాజమండ్రి శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. యురాలజిస్ట్ డాక్టర్ సిహెచ్. కరుణాకర్‌రెడ్డి వృద్ధుల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ నెల 19న పురుషుల దినోత్సవాన వన సమారాధన జరుగుతుందన్నారు.



టైలర్ కు కుట్టు మిషన్‌అందజేస్తున్న హరీష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబానికి కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి-కరప

వేళంగిలో జరిగిన అగ్నిప్రమాదంలో టైలర్ కొప్పిశెట్టి లోవరాజు వికలాంగుడు ఉపాధి కోల్పోయిన సంగతి తెలుసుకున్న కాకినాడ పట్టణానికి చెందిన తలాటం హరీష్ తమ హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయం అంద జేశారు. బాధిత టైలర్ కుటుంబానికి ట్రస్ట్ ద్వారా రూ.11,000తో కుట్టు మిషన్‌ను ఒక మోటారును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్, సాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ కాకినాడ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సహకారంతోనే స్మార్ట్ సిటీ ని క్లీన్ కాకినాడగా చేయగలమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఆయన14వ సర్కిల్ పరిధిలోని గోకులం, ఐడియల్ కళాశాల ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిం చారు. కొన్నిచోట్ల చెత్తను రోడ్లపై వేయడాన్ని గమనించారు. మరికొన్నిచోట్ల వేర్వేరుగా డస్ట్ బిన్ లు అందుబాటులో ఉన్నప్పటికీ తడి పొడి చెత్తను కలిపి ఇస్తున్న విషయాన్ని గుర్తించారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్లే కొన్నిచోట్ల ఇటువంటి పరిస్థితి ఎదురవుతోందని, దీనిపై శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు చొరవ తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకష్ణ సచివాలయ కార్యదర్శులు సిబ్బంది ఉన్నారు.

నేడు వికాస జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్:

వికాస, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ " ఆధ్వర్యంలో ఈ నెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడి కరణం లచ్చారావు ఓ ప్రకటనలో తెలి పారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఎం.ఎన్.సి, సాఫ్ట్వేర్ , ఫార్మా , బ్యాంకింగ్, టెక్నికల్ తదితర 60కు పైగా కంపెనీల్లో సుమారు 3000 కు పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, దివ్యాంగులకు, అనాథలకు కూడా వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. హెచ్.సి.ఎల్, సాగర్సాఫ్ట్ సొల్యూషన్స్, హాల్మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్, మేకర్‌మైండ్ సాఫ్ట్ సొల్యూషన్స్, గెబ్స్ హెల్త్ కేర్ సొల్యూషన్స్, సదర్లాండ్స్, అపోలో హాస్పటల్స్, సైలెంట్ మైండ్స్, డ్రీమ్, ఐటెక్ సాఫ్ట్వేర్ సొల్యూషన్, ఐ.సి.ఐ.సి.ఐ (నిట్) బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి, ఎస్‌ఐ తదితర ప్రముఖ కంపె నీల్లో ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 18 నుండి 40 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000/- నుండి రూ.50,000/ వరకు జీతం ఇన్సెంటివ్స్ ఉచిత వసతి, భోజనం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థుడ లందరూ ఈనెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడ వద్ద ఉదయం 9 గంటకు సర్టిఫికెట్స్ జెరాక్సతో హాజరుకావలెను. వివరాలకు 8297400666, 7799376111 నంబర్లను సంప్రదించా లన్నారు.

నేరాలు ఘోరాలు

జాతీయ రహదారిపై మహిళ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని రామవరం వద్ద డివైడర్ దాటుతూ పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన గండేటి వెంకటలక్ష్మిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతురాలు వెంకటలక్ష్మి రామవరం లోని సంబంధిత బంధువుల ఇంటికి వస్తున్న సమ యంలో జాతీయ రహదారిపై వాహనం ఢీకొ నడంతో మతి చెందినట్లు తెలిపారు. వాహనాన్ని ట్రేస్ ఔట్ చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపుల కేసులో భర్త, అత్తలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

భార్యను వేధించిన కేసులో భర్త, అత్తకు ఏడా దిన్నర జైలు శిక్ష, ఒక్కొక్కరికి 16,000 జరి మానా విధిస్తూ కాకినాడ అదనపు జేఎఫ్‌సిఎం న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పారని కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ గ్రామీణ తూరంగికి చెందిన దామి శెట్టి రమాదేవికి వీరేంద్రకుమార్‌తో 2012లో వివాహమైంది. ఆమెను అద నపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తలు వేధిం చినట్లు రమాదేవి ఫిర్యాదు మేరకు 2017లో కాకినాడ దిశ మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున కేసును రఘువీర్ వాదించారు.

వేధింపుల కేసులో అత్తమామలకు జైలు శిక్ష

కోడల్ని వేధించిన కేసులో అత్తమామలకు ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో అదనపు జె.ఎఫ్.సి. ఎం.న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పిట్టు కాకినాడ దిశ పోలీసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన తలుపులమ్మ దేవికి అదే ప్రాంతానికి చెందిన శివ కుమార్‌తో 1999లో వివాహమైయింది. 2016లో భర్త, అత్తమామలు, మరిది, తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వాదోపవాదనలు ను విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

కోడి పందేలపై పోలీసులు దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తి గ్రామ శివారు, పెద్దనా పల్లిలోనూ కోడి పందాలు, పేకాట ఆడు తున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు. వారి వద్ద నుండి రెండు కోళ్ళు రూ.3000 స్వాధీనం చేసు కుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కాని స్టేబుల్ పండు శ్రీనివాస్ ఈశ్వర్లతో పాటు ఎపిఎస్‌పి సిబ్బంది ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ 1,12,556 విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని వల్లభ స్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహణకు యాత్రికులు శనివారం రూ.1,12,556 విరాళా లుగా అందజే శారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన అడపా వీరబాబు నిత్యాన్నదాన పథకానికి రూ.15,001 విరాళంగా అందజేశారన్నారు. వివిధ టిక్కెట్ల ద్వారా శనివారం రూ.1,73,960 ఆదాయం సమకూ రిందన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతను అలవర్చుకుంటూ పోటీ పరీక్షలలో పాల్గొనాలని ఎంఇఒ రామచంద్రరావు, మండల అభివృద్ధి అధికారి ఐదం రాజులు అన్నారు. నాసా స్పేస్ ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేసిన తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను వారు శనివారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2022- 23 సంవత్సరానికి సంబంధించి 36 మంది విద్యార్థులు తమ స్కూల్ నుంచి నాసాకి ఎంపిక కావడం ఆనందదాయకంగా ఉందన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించేలా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వారు నిర్వహించు పొలంబడులు, తోటబడుల్లో చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.ఆనంద కుమారి పేర్కొన్నారు. శనివారం అమలాపురం వ్యవసాయ సబ్-డివిజన్‌లోని అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అమలాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యలు తాళలేక విఆర్ఎ ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరంలో కుటుంబ, ఆర్థిక సమస్యలను తాళలేక విఆర్ఎ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పత్రా సుభాష్ చంద్రబోస్ సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరం విఆర్ఎగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఏడేళ్ల క్రితం అతనికి పక్షవాతం వచ్చింది. అతను కుటుంబ, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. అయితే అతనికి కుమారుడు నిరుద్యోగి. వివాహమైన కుమార్తెకు భర్త చనిపోయి ఆమె కూడా తండ్రి వద్దే ఉంటోంది. ఈ పరిస్థితులను తట్టుకోలేక చంద్రబోస్ శుక్రవారం ఉదయం తన ఇంటి వద్ద పురుగుమందులు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందతూ అతను శుక్రవారం సాయంత్రం మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. రామకృష్ణ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఫ్యాక్టరీలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు ఇవి.. దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులో త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ కి చెందిన సురేష్(36) ఫ్యాక్టరీలో తయారయ్యే పాటర్న్ గ్లాసును తీసే సమయం లో కాలు జారి గ్లాసు అంచు మీద పడగా ఎడమ వైపు మెడ దగ్గర తెగి రక్తస్రావమైంది. ఫ్యాక్టరీ సిబ్బంది అతనిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. ఆస్పత్రి సమాచారం పై కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శనివారం తెలిపారు.

పేకాట శిబిరం పై దాడి నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాటవరం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసలు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామ శివారులో పేకాటశిబిరం నిర్వహిస్తురని ఎస్ఐ శుభ శేఖర్ కు సమాచారం అందింది. ఆయన సిబ్బందితో కలిసి పేకాట శిబిరం పై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 7 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి -మండపేట

నియోజకవర్గంలో గత కొద్ది రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వరిన కోసిన రైతులు ఆందోళనలో ఉన్నారని దానికి శుక్రవారం కురిసిన వర్షమే నిదర్శనమనన్నారు. గత రెండు పంటలకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు

ప్రజాశక్తి-రాజోలు

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చి, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు తెలిపారు. శనివారం సఖినేటిపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అంతర్వేది, బెల్లంకొండ వారి కొడప నందు మనబడి నాడు-నేడు రెండవ విడత కార్యక్రమంలో భాగంగా రూ. 35,98,714లక్షలతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం జగన్ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-మండపేట

. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కల్లుగీత కార్మికుల క్షేమం కోసం సిఎం జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ చిత్రపటానికి మండపేట శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం గీత కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. గణేశ్వరరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే చెల్లించే పరిహారాన్ని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. సహజ మరణం చెందితే వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.ఐదు లక్షల పరిహారం చెల్లిస్తుంద న్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పెంకే గంగాధర్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి మద్యం షాపులో శుక్రవారం అర్ధరాత్రి సుమారు రూ.2 లక్షల 17వేల నగదు చోరీ అయ్యింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలివి.. శుక్రవారం అమ్మకాలు జరిగిన సొమ్మును మద్యం షాపులో పనిచేసే ఉద్యోగులు ఇనుప పెట్టిలో భద్రపరిచి రాత్రికి ఇంటికి వెళ్లారన్నారు. అయితే మద్యం షాప్‌కు ఇద్దరు కాపలాదారులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు చోరీ రాత్రి రెండు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం మద్యం షాప్ ఉద్యోగులు నగదు చోరీ జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి కాకినాడ నేర పరిశోధన సంస్థ (క్లూస్ టీం) చేరుకుని ఆధారాలను సేకరించారు.